పంటలు ఎండిపోకుండా చర్యలు

- అడ్డగోలుగా ఇసుక దోచుకుంటామంటే కుదరదు
- నీటి వనరులు ఉన్న చోట లిఫ్టులను ఏర్పాటుచేయాలి
- మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సక్రమంగా ఇవ్వాలి
- వారం రోజుల్లో టాస్క్ ఆరంభానికి ఏర్పాట్లు చేయాలి
- అధికారుల కోసం రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు భూముల్లో పండిస్తున్న పంటలు ఎండిపోకూడదని, కలెక్టర్ నీటి పారుదల శాఖాధికారులతో సమన్వయం చేసుకుని సాగునీరు చివరి ఆయకట్టు భూములకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మ్యూజియంను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మ్యూజియం, గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఇది ప్రజాప్రభుత్వమని, నియంతృత్వ ప్రభుత్వం కాదని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే ప్రజల సమస్యలు తీరడంతో పాటు అభివృద్ధి కూడా బాగా జరుగుతుందన్నారు. ఆలోచనలను తమతో పంచుకోవాలని, అందరం కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా పని చేస్తూ రాష్ట్రంలోనే జిల్లా ముందు వరుసలో ఉండే విధంగా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఒక్క లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టలేదన్నారు. ఎక్కడైతే నీటి వనరులు ఉంటాయో వాటిని గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు. గతంలో అధికారుల అభిప్రాయాలతో సంబంధం లేకుండానే ప్రభుత్వం చెప్పిన పనినే చేశారన్నారు. దాని వల్ల ప్రజలకు ప్రయోజనం తప్ప నష్టమే జరిగిందన్నారు. అలాంటి పని తమ ప్రభుత్వం చేయదన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటివరకు 10.50 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల రూపాయల వరకు వైద్యం అందిస్తున్నామని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం గ్రామసభల్లో దరఖాస్తులను తీసుకుని ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకాన్ని కలిగించారని అన్నారు. జిల్లా చరిత్రను ప్రతిబింబించేలా కలెక్టరేట్‌లో మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్డీవో కార్యాలయాలను ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్‌ను ఆదేశించారు. చాలా గ్రామల్లో మిషన్ భగీరథ ద్వారా నీళ్ల రావడం లేదని, ఆ పథకంలో అనేక లోపాలు ఉన్నాయని, వాటన్నింటిని తమ నెత్తి మీద పెట్టుకోకుండా ప్రజలు ఇబ్బందులు పడకుండా నీళ్ల ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక ప్రకృతి ప్రసాదించిన వనరు అని ఇష్టారాజ్యంగా అడ్డగోలుగా దోచుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఓవర్‌లోడ్‌ను అరికట్టాలని సంబంధిత అధికారులను శ్రీధర్‌బాబు ఆదేశించారు. వారం రోజుల్లో జిల్లా కేంద్రంలో విద్యార్థులు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ కల్పించేందుకు టాస్క్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

- అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్



ధర్మారం మండలంలోని నర్సింగాపూర్, ఖిలవనపర్తి గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని పేదలకు పంచాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. ధర్మారం మండలంలో ఉన్న మేడారం రిజర్వాయర్ ద్వారా సాగునీరు, తాగునీరు అందించే విధంగా శాశ్వత పరిష్కారం చూపించాలని, భగీరథ పైప్‌లైన్ లీకేజీ సమస్యలకు త్వరితగతిన పరిష్కరించాలని, రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు.

పత్తిపాక వద్ద రిజర్వాయర్ నిర్మించాలి

- చింతకుంట విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ కోసం గతంలో ప్రతిపాదించిన విధంగా ధర్మారం మండలం పత్తిపాక వద్ద రిజర్వాయర్‌ను నిర్మించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ఎస్సారెస్పీ ద్వారా రోజంతా తిరిగినా కూడా సరిపడా నీళ్ల రావడం లేదని, చివరి ఆయకట్టు భూములకు నీళ్ల అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోకుండా ఉండేందుకు ఎల్లంపల్లి నుంచి 2.3 టీఎంసీల నీటిని విడుదల చేయాలన్నారు. మానేరు నదిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచుల గడువు ముగిసిందని, మళ్లీ కొనసాగించవద్దని అన్నారు. ఇసుక వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే నష్టమే ఎక్కువగా ఉందని అన్నారు. ఓదెల మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ల అందడం లేదని చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించాలి

- రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, రామగుండం ఎమ్మెల్యే



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ మంత్రిని కోరారు. రామగుండం నియోజకవర్గంలోని ఆయకట్టు భూములకు సాగు నీరందించేందుకు చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిచిపోయాయని, ఇందుకు కావాల్సిన బడ్జెట్ ఇచ్చి త్వరగా పూర్తి చేయించాలన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులను జిల్లా అవసరాలకే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రిని కోరారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కృషి చేయాలని, పోస్టులను భర్తీ చేయాలన్నారు. గోదావరి బ్రిడ్జి వద్ద అనేక మంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, వీటిని నివారించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలన్నారు. రామగుండంలో అనేక మంది గంజాయికి అలవాటు పడుతున్నారని, దానిని అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీ, అదనపు కలెక్టర్లు జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్, జె అరుణశ్రీ, వివిధ జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ఎగ్జిబిట్స్ : డీఈవో

పెద్దపల్లి కల్చరల్, జనవరి 28 : దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు రెండు విభాగాలలో జిల్లా నుంచి ఎగ్జిబిట్స్ ఎంపికైనట్టు డీఈవో డి.మాధవి తెలిపారు. విజయవాడలో కొనసాగనున్న ఎస్.ఐ.ఎస్.ఎఫ్-2023కు పెద్దపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగినేడు విద్యార్థులు ఆర్.కీర్తన, బి.సాత్వికలు గైడ్ టీచర్ కె.జగదీశ్వర్‌రెడ్డి మార్గదర్శనంలో రూపొందించిన ఎగ్జిబిట్ ఎంపికైనది. అలాగే టీచర్ కేటగిరిలో సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన పి.సురేందర్ ఏర్పాటుచేసిన ప్రదర్శన ఆకట్టుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో 11మంది స్టాఫ్ నర్సులుగా ఎంపిక

కళ్యాణ్‌నగర్, జనవరి 28: ప్రభుత్వం ఆరునెలల క్రితం నిర్వహించిన స్టాఫ్ నర్సు పరీక్షల్లో గోదావరిఖనికి చెందిన 11మంది ఎంపికయ్యారు. వీరికి ఈనెల 31న ఎల్‌బీ స్టేడియంలో జరిగే స్టాఫ్ నర్సు నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ చేతుల మీదుగా అందుకోనున్నారు. వీరు ఎంపిక కావడంపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హర్షం వ్యక్తం చేశారు.

ఓదెల మల్లన్న జాతరకు తరలివచ్చిన భక్తజనం



ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఓదెల, జనవరి 28 : భక్తులకు ఆరాధ్య దైవమైన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరకు ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మల్లన్న భక్తులకు ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుని కోడెముక్కులు, బోనాలు సమర్పించారు. వ్యవసాయ పనులు పూర్తవుతున్న సమయంలో జాతరకు భక్తుల రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు క్షేత్రంలో పెద్దఎత్తున ఒగ్గు పూజారులు పట్నాలు వేసిన అనంతరం భక్తులంత బోనాలను సమర్పించారు. భూపాలపల్లి, కాటారం నుంచి వచ్చిన భక్తులు కోడెమొక్కులను సమర్పించారు. అలాగే వివిధ పట్టణాలకు చెందిన భక్తులంతా వాహన పూజలను నిర్వహించి,మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.జాతరకు వివిధ జిల్లాల నుంచి దాదాపు రెండు వేల మంది భక్తులు తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

సుల్తానాబాద్ , జనవరి 28 : జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల రగ్బీ టీమ్ ఎంపిక పోటీలను సుల్తానాబాద్‌లో జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి మనోజ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం జరిగిన ఎంపిక పోటీలలో బాలుర విభాగంలో 30మంది, బాలికల విభాగంలో 20మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు 2024, ఫిబ్రవరి మూడు, నాలుగు తేదీల్లో యాదాద్రి-భువనగిరి జిల్లాలో నిర్వహించే ఆరవ తెలంగాణ రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అంతటి శంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి నరేష్, బోల్లి సత్యనారాయణ, ఆకుల అజయ్, ఇక్బాల్, ఎల్లే రాజు, శివ, వెంకటేష్, సీనియర్ క్రీడాకారులు ముస్తఫా, సిద్ద తిరుపతి, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుడి నేత్రదానం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 28: అనారోగ్యంతో మరణించిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మార్క స్వామి నేత్రాలను దానం చేసి ఔనత్యాన్ని చాటారు ఆయన కుటుంబీకులు. అల్లూరుకు చెందిన మార్క స్వామి అనారోగ్యంతో శనివారం రాత్రి కన్నుమూశాడు. సదాశయ ఫౌండేషన్ సభ్యులు స్వామి కుటుంబ సభ్యులకు నేత్ర, అవయవ దానాలపై అవగాహన కల్పించడంతో ఆయన నేత్రాలు దానం చేయడానికి అంగీకారం తెలిపారు. వాసన్ ఐబ్యాంక్ టెక్నీషియన్ ఆరిఫ్ మార్క స్వామి నేత్రాలను సేకరించి ఐబ్యాంక్‌కు తరలించారు. విశాదంలోనూ సమాజ హితం కాంక్షించి నేత్రదానానికి అంగీకరించిన స్వామి కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు లగిశెట్టి చంద్రమౌళి, మారెల్లి రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుండేటి రాజేష్‌లు అభినందించారు.

సన్మాన సభలో బీజేపీ నాయకుల ఘర్షణ



ఘర్షణ పడుతున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లి, జనవరి 28: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన బీజేపీ సన్మాన సభలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పార్టీ అధిష్ఠానం నూతన జిల్లా అధ్యక్షుడిగా చందుపట్ల సునీల్‌రెడ్డి నియమించిన నేపధ్యంలో స్థానిక అమర్ చంద్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సన్మాన సభలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావు, జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వేదిక మీద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కేవలం ప్రదీప్‌రావు ఫొటోనే వేశారని, గుజ్జుల ఫొటో ఎందుకు వేయలేదని, పదవులు లేని వారిని వేదిక మీద కూర్చోబెట్టారని గుజ్జుల వర్గం ఆగ్రహానికి గురై కుర్చీలు విసిరారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కాగా, అసలు గుజ్జులతోపాటు ముఖ్య నాయకులకు ఆహ్వానం పంపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంట పాటు వాదన కొనసాగింది. మండల కమిటీలు కార్యకర్త నిర్ణయం మేరకు నియమించాలని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని నాయకులు పల్లె సదానందం విమర్శించారు. గతంలో కూడా అనేకసార్లు ఘర్షణలు జరిగిన దాఖాలాలున్నాయని, పెద్దపల్లిలో పార్టీ పరిస్థితి అంతంతా మాత్రంగా ఉన్నప్పటికీ కుమ్ములాటలకు సరికాదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో ఎవరికి వారే ఇష్టారాజ్యాంగా వ్యవహరించడంతో నియోజకవర్గంలో పార్టీ దిగజారిపోయిందని విమర్శలు వ్యక్తమయ్యాయి. వేదిక మీద రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డెపెల్లి రాంచందర్, కన్నం అంజయ్య, మాతంగి రేణులు కూర్చోని సభ కొనసాగించారు.

ఓవర్ లోడ్‌పై టీఎస్ఎండీసీ కొరడా..



లారీని తనిఖీ చేస్తున్న టీఎస్ఎండీసీ అధికారులు

మంథని, జనవరి 28: ఇసుక ఓవర్‌లోడ్‌పై టీఎస్ఎండీసీ కొరడా ఝుళిపిస్తోంది. మంథని, ముత్తారం ఇసుక క్వారీల నుంచి రవాణా అవుతున్న ఇసుక లారీలు, టిప్పర్లను టీఎస్ఎండీసీ అధికారులు ఆదివారం తనిఖీలు చేశారు. మంథని మండలం పుట్టపాక వద్ద ఆదివారం రాత్రి మాటువేసిన టీఎస్ఎండీసీ ఎస్ఆర్‌వోలు రాజుకుమార్, అరవిండ్‌ల ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్బంగా వారు వే బిల్లులు ఇతర పత్రాలను పరిశీలించారు. రెండో రోజూ తనిఖీల్లో భాగంగానే ఈ తనిఖీలను చేపట్టినట్లు వారు తెలిపారు.

జిల్లాను ఎట్టి పరిస్థితుల్లో రద్దు చేసేదిలేదు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఎలిగేడు, జనవరి 28 : జిల్లాను ఎట్టి పరిస్థితుల్లో రద్దు చేసేదిలేదని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఆదివారం రూ.36లక్షలతో నిర్మించిన రైతు వేదిక, గ్రామ పంచాయతీ బిల్డింగ్ రూ.22లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్, రూ.20లక్షలు వైకుంఠదామం రూ.12లక్షలు సిగ్రిగేషన్ షెడ్ రూ.3.40లక్షలు, గ్రంథాలయం రూ.1.20 లక్షలు, వాటర్‌ప్లాంట్ రూ.1,20 వెచ్చించి నిర్మించిన వాటిని ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్‌ను ఆయన పరిశీలించారు. సుల్తాన్‌పూర్ గ్రామం మంచి అభివృద్ధి సాధించి మిగిలిన గ్రామాలకు ఆదర్శ వంతంగా నిలిచిందని, పట్టుదలతో వివిధ రంగాలలో మంచి పురోగతి సాధించడం అభినందనీయమని మంత్రి అన్నారు. జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించి ఆదర్శ వంతంగా నిలిచిన సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ పాలక మండలికి గ్రామప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వ్యవసాయ రంగంలో మంచి అభివృద్ధి సాధించారని, పాఠశాలల్లో సైతం కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందిస్తు న్నారని, రీడింగ్ రూమ్ ఏర్పాటుచేసి అందరు చదివేలా చర్యలు తీసుకోవడం వంటి మంచి కార్యక్రమాలను అమలుచేస్తూ సుల్తాన్‌పూర్ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. గ్రామపంచాయతీ భవనం నుంచి శివపల్లి వరకు నాలుగు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు పంచాయతీ శాఖ మంత్రితో మాట్లాడి మంజూరు చేసేలా కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ సుల్తాన్‌పూర్ పాత రోడ్డు బీజీ రోడ్డు వేయాలని, గ్రామపంచాయతీ నుంచి శివపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్సీ భానుప్రసాదరావు మాట్లాడుతూ జిల్లాలో సైతం ఐటీ పరిశ్రమల అభివృద్ధి జరిగే విధంగా మంత్రి చొరవ తీసుకుని స్థానిక యువతకు ఉపాధి లభించేలా పెద్దపల్లికి పరిశ్రమలు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ఆలోచన సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

పెద్దపల్లిటౌన్, జనవరి 28: రాష్ట్రంలోని జలాశయాలన్నింటిలో నీటిపై తెలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ సరికొత్త ఆలోచన మత్స్యకార కుటుంబాల భవిష్యత్తుపై మరణ శాసనం అవుతుందని, ఈ ప్రతిపాదనలను విరమించుకోవాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. తెలంగాణలోని వివిధ జలాశయాలకు చెందిన మత్స్యకార ప్రతినిధులు, తెలంగాణ ఫిషరీస్ సొసైటీ నాయకులతో కూడిన ప్రతినిధుల బృందంతో కలిసి ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కూడా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ఎంపిక చేసిన జలాశయాలలో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలని ప్రతిపాదించిందని, అయితే అందువల్ల ఉత్పన్నమయ్యే సామాజిక, పర్యావరణ సంబంధమైన సమస్యలపై తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యక్తం చేసిన అభిప్రాయాలను మన్నించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సదరు ప్రతిపాదనలను పక్కకు పెట్టిందని గుర్తుకు చేశారు. ప్రకృతిలో అందుబాటులో ఉన్న పునరుత్పాదక ఇంధన వనరులను మానవ సంక్షేమానికి వినియోగించుకునే విషయంలో తెలంగాణ ఫిషరీస్ సొసైటీకి ఎలాంటి అభ్యంతరాలు లేనప్పటికీ రిజర్వాయర్లలో సౌర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల మత్స్యకారుల జీవనోపాధికి తీవ్రమైన ఆటంకాలు తలెత్తే ప్రమాదాన్ని నిలువరించడం కోసం మాత్రమే తాము ఈ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నట్లు పిట్టల రవీందర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 159 రిజర్వాయర్లలో సుమారు నాలుగు లక్షల మంది మత్స్యకారులు తమ జీవనోపాధిని పొందుతున్నారని, ఈ రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల ఈ మత్స్యకారుల చేపల వేటకు ఆటంకాలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలలో జలాశయాలకు అనుబంధంగా నిర్మించిన ప్రధాన కాలువలపైన సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొలుపుతున్నారని ఈ టెక్నాలజీ రాష్ట్రంలో కూడా అనుసరించాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కనకయ్య ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్, మహిళా విభాగం కన్వీనర్ వేల్పుల సరోజన తదితరులు పాల్గొన్నారు.

పేద వైష్ణవులను ఆదుకోవాలి

ఇల్లందకుంట, జనవరి 28: రాష్ట్రంలోని నిరుపేద శ్రీవైష్ణవులను ఆర్థికంగా ఆదుకోవాలని వైష్ణవ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు డింగరి రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణంలో ఆదివారం శ్రీవైష్ణవ సేవా సంఘం ఏర్పాటు చేసి 25ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డింగరి రవికుమార్ మాట్లాడుతూ శ్రీవైష్ణవి సేవా సంఘం పేద వైష్ణవులకు ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న పేద వైష్ణవులకు ఆర్థిక, వైద్య, విద్య పరంగా ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అందులో నిరుపేద వైష్ణవులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. .కార్యక్రమంలో డింగరి శ్రీధర్, సముద్రాల ప్రసాదచార్యులు, సముద్రాల సుదర్శనాచార్యులు, శేషం రామాచార్యులు, శేషం వంశీధరాచార్యులతో పాటు 350 మంది పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం

జమ్మికుంట రూరల్, జనవరి 28: జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజూరాబబాద్ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంకని బాను, పార్లమెంట్ ఇన్‌చార్జి దాసరి ఉష, రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, కన్వీనర్లు శిరీష, జన్ను స్వరూప, మిడిదొడ్డి స్వప్న హాజరయ్యారు. బీఎస్పీ అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానంపై కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో మంద బాలన్న, మేకల రవీందర్, మారపల్లి మొగిలయ్య, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగుతున్న జనజాతర



స్వామి వారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- రాజన్న సన్నిధికి తరలివస్తున్న భక్తులు - గర్భాలయ ప్రవేశం నిలిపివేసిన అధికారులు

వేములవాడ, జనవరి 28: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో కిటకిట లాడుతోంది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తేదీ సమీపిస్తున్న క్రమంలో వేములవాడకు వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో రాజన్న క్షేత్రంలో భక్తజన జాతర కొనసాగుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 వేల మందికి పైగా భక్తులు తమ ఇష్టదైవమైన రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు జామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం సర్వదర్శనం శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా మూడు రోజులుగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరగా సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం పడుతోంది. మరోవైపు బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూలైన్లలో నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎన్టీపీసీ రిజర్వాయర్‌ను సందర్శించిన ఫిషరీస్ సొసైటీ



రిజర్వాయర్‌ని పరిశీలిస్తున్న బృందం

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 28: రామగుండం ఎన్టీపీసీ జలాశయాన్ని ఆదివారం తెలంగాణ ఫిషరీస్ సొసైటీ బృందం సందర్శించింది. ఎన్టీపీసీ జలాశయంలో తేలియాడే సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈనేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుతో మత్యకారులపై ఎటువంటి ప్రభావం చూపే అవకాశం ఉన్నదనే అంశాన్ని పరిశీలించారు. సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల తేలియాడే సౌరవిద్యుత్ కేంద్రం దాదాపు సగానికి పైగా జలాశయ విస్తీర్ణం అవసరం ఉంటుందని ఎన్టీపీసీ అధికారులు ఫిషరీస్ సొసైటీ బృందానికి వివరించారు. గతంలో జలాశయంలో చేపల వేటను కొనసాగించిన మత్స్యకారులను సోలార్ విద్యుత్ కేంద్ర ఏర్పాటు తర్వాత అనుమతించడం లేదని అధికారులు తెలిపారు. విద్యుత్ కేంద్ర ఏర్పాటు కారణంగా ఉపాధిని కోల్పోతున్నామని సమీప గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఫిషరీస్ సొసైటీ ప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. జలాశయంలో సౌర పలకల ఏర్పాటు చేయగా మిగిలిన విస్తీర్ణంలో తమకు చేపలు పట్టుకునే అవకాశం కల్పించే లా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఫిషరీస్ సొసైటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. జలాశయాన్ని పరిశీలించిన వారిలో తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు కనకయ్య, చంద్రశేఖర్‌తో పాటు ప్రతినిధులు ఉన్నారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వేములవాడ, జనవరి 28: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి శ్రీసుధ దర్శించుకున్నారు. ఆదివారం నాడు కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనం కోసం వచ్చిన ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జస్టిస్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ ఏఈవో బి శ్రీనివాస్ ప్రసాదం అందజేశారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్ అంతకు ముందు ఆలయ గెస్ట్ హౌస్ వద్ద స్వాగతం పలికారు. ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకుడు అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్ పవన్ అధికారులు వారి వెంట ఉన్నారు.



జస్టిస్ శ్రీసుధకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

- ఎంపీ బండి సంజయ్ పూజలు



ఎంపీ బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయకమిటీ సభ్యులు

గన్నేరువరం, జనవరి 28: మండలంలోని మైలారం గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి కల్యాణం, పెద్దపట్నాలు, జాతర ఉత్సవాలు ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్వామివారిని దర్శించుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెలించుకున్నారు. ఆలయకమిటీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయకమిటీ చైర్మన్ వరాల పర్శరాములు, బీజేపీ మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీజేపీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నగునూరి శంకర్, గంప వెంకన్న, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, తిప్పర్తి నిఖేష్, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఎంపీ

మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయం, గన్నేరు వరంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, మైలారంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలారం, ఖాసింపేట ఆలయాలలో ఆయనకు గజమాలను వేసి, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, బీజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్, మచ్చ మురళి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి

- హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ



జువైనల్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ

కరీంనగర్ లీగల్, జనవరి 28: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని హైకోర్టు న్యామూర్తి పీ శ్రీసుధ అన్నారు. ఆదివారం కరీంనగర్ కోర్టు భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్)కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్య త్తులో బాల నేరస్తుల కేసులు లేని జిల్లాగా కరీంనగర్ ఏర్పడాలని ఆశిస్తున్నానన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ మాట్లాడుతూ న్యాయవాదులు కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తే సత్వర న్యాయం జరిగి దేశంలోనే కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, మెజిస్ట్రేట్ సరళరేఖ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, మేజిస్ట్రేట్‌లు, ప్రభుత్వ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 36 ఆలయాల ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్

కరీంనగర్ కల్చరల్, జనవరి 28: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 36 ఆలయాల ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు సంబంధించి విజయగణపతి సాయిబాబా దేవాలయం, పాతబజార్ గౌరీశంకరాలయం, మంకమ్మతోట భక్తాంజనేయస్వామి ఆలయం, జెడ్‌పి క్వార్టర్స్‌లోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, అంజనేయస్వామి ఆలయాలు, ప్రొద్దుటూరి ట్రస్టు, భారత్ టాకీస్‌రోడ్ వీరాంజనేయస్వామి ఆలయం, మంకమ్మతోట వేంకటేశ్వరాలయం, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రాంపూర్ గిద్దెపెరుమాళ్ళ ఆలయం, కోతిరాంపూర్ పోచమ్మ ఆలయం, కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, హుజూరాబాద్‌లోని హనుమాన్ ఆలయం, కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం, తిమ్మాపూర్ నల్లగొండ సీతారామస్వామి ఆలయం, జమ్మికుంట వేంకటేశ్వరాలయం ఉన్నాయి. జగిత్యాల జిల్లాలోని శ్రీనివాస భవానీ అంజనేయ శంకరాలయం, బండ లింగాపూర్ గండి హనుమాన్ ఆలయం, మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయం, రాయికల్, కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయం, పొలాస పౌలస్తీశ్వరాలయం, జగిత్యాల రాజరాజేశ్వరాలయం, రాయికల్ అంజనేయస్వామి ఆలయం, మెట్‌పల్లి లక్ష్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు, మల్లాపూర్ గంగాగౌరీశ్వరస్వామి ఆలయం, కొరుట్ల వేంకటేశ్వరాలయం, కోటిలింగాల కోటేశ్వరాలయం, ఎరదండి మల్లికార్జున గంగామాత ఆలయం, సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్నాయి. మంథని మహాలక్ష్మీ ఆలయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయం, పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనారసింహస్వామి ఆలయం, సిరిసిల్ల జిల్లాలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం, శివసాయిబాబా ఆలయం, పోచమ్మ ఆలయం, విశ్వనాథ స్వామి ఆలయం ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ఆసక్తి గల వారు ధర్మకర్తలుగా ఉండేదుకు తమ దరఖాస్తులను 20 రోజుల లోపు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో గానీ, రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి దేవాదాయ, పోలీసు శాఖల నుంచి వెరిఫికేషన్‌కు పంపిస్తారని, ఆ తర్వాత ఎంపికైన వారి లిస్టు రాష్ట్ర కమీషనరేట్ ద్వారా వస్తుందని తెలిపారు. అనంతరం ఎంపికైన వారితో పాలక వర్గ ప్రమాణ స్వీకారం చేయిస్తామని తెలిపారు.

విద్యుత్ బిల్లులు కాజేసిన కేసులో ఒకరి అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మానకొండూర్‌లోని వెనుకబడిన తరగతుల సమీకృత హాస్టల్‌లో రూ. 31లక్షల విద్యుత్ బిల్లులను కాజేసిన కేసులో అప్పటి వార్డెన్ అన్నల దాసు లక్ష్మీనారాయణను సీఐ రాజ్‌కుమార్ అరెస్టు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని హాస్టల్ వార్డెన్‌గా 2018 నుంచి 2021 వరకు అన్నలదాసు లక్ష్మీనారాయణ విధుల్లో కొనసాగారు. హాస్టల్‌లోని 31లక్షల రూపాయల మేరకు విద్యుత్ బిల్లులను కాజేసాడని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్‌కుమార్ అతడిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 19న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరుపాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో ఆదివారం పేకాడుతున్న ఆరుగురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. వారి నుంచి 14వేల రూపాయలు స్వాధీనం చేసుకొని మానకొండూర్ పోలీసులకు అప్పగించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పెద్దపల్లి రూరల్, జనవరి 28: మండలంలోని పాలితం గ్రామ పంచాయతీ అనుబంధ పుట్టపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తోకారం శ్రీనివాస్‌కు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. మంటలు చెలరేగుతుండటంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలానికి ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంటలను పూర్తిగా ఆర్పేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.50 వేల వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

వ్యవసాయ బావిలో పడి మాజీ సర్పంచ్ మృతి

బీర్‌పూర్, జనవరి 28: మండలంలోని తాళ్లధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఏనుగు ఎల్లారెడ్డి(54) ఆదివారం ఉదయం తాను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న పొలానికి నీరు పారించడం కోసం వెళ్లాడు. పొలానికి వెళ్లిన ఎల్లారెడ్డి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పొలం వద్దకు వెళ్లి గమనించారు. అప్పటికే ఎల్లారెడ్డి వ్యవసాయ బావిలో పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఎల్లారెడ్డి కుమారుడు మహేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ గజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే బిల్లులు రాకుండా అడ్డుకున్నారు

- గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు ఆవేదన

గన్నేరువరం, జనవరి 28: మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తమను నాలుగేళ్లుగా మానసికంగా వేధించి, బిల్లులు రాకుండా అడ్డుకున్నారని మండలంలోని గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు సెల్ఫీ వీడియోను విడుదల చేసి మండల సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. తాము ఆర్థికంగా నష్టపోవడంతో ఉన్న 30 గుంటల భూమిని అమ్ముకుని కరీంనగర్‌కు పోయి కులవృత్తి చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నామని చెప్పారు. తమ ఉసురు అతడికి తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియో వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



లింగంపల్లి బాలరాజు

గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి



మాట్లాడుతున్న గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్

మెట్‌పల్లి, జనవరి, 28: రాష్ట్రంలోని గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్ కోరారు. ఆదివారం పట్టణంలోని నరేంద్ర గార్డెన్‌లో నియోజక వర్గంలోని గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో చెపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన వారికి బీమా సౌకర్యం, 50 ఏండ్లుపై పడిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ పల్లికొండ ప్రవీణ్ మాట్లాడుతూ జీవో 06 రద్దు చేయాలని, గంగపుత్రులకు ఉచిత వాహనాలు, చెరువుల అభివృద్ధి, చెపపిల్లలకు బదులుగా చెరువులో నాణ్యమైన చేపలను చెరువులో పెంచుకోవడానికి నగదును అందజేయాలనినియోజక వర్గంలో చేపల పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో సంఘ భవనాల ఏర్పాటుకు రాష్ట ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరంచంద్ మాట్లాడుతూ గంగపుత్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌సీఎస్ డైరెక్టర్లు పర్రే శంకర్‌రాజు, ఎల్లా శ్రీనివాస్, పల్లికొండ భూమేష్, సముద్రాల రూప, శ్రీనివాస్, లచ్చయ్య, రాజయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, గంగపుత్రులు పాల్గొన్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు



తలనీలాలు తీస్తున్న సిబ్బంది

- ఐదు సార్లు తలనీలాల టెండర్లు వాయిదా
- మరో సారి 1న నిర్వహణకు ఏర్పాట్లు
- ఆరు నెలలుగా దేవస్థానం తరుపున సేకరణ



కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, జనవరి 28: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధి లో భక్తులు సమర్పించే తలనీలాలకు టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో జీఎస్టీ నెపం, ప్రస్తుతం మార్కెట్‌లో కురులకు ధ రలు పడిపోయాయని పేర్కొంటూ తలనీలాలు సేకరించే కాంట్రాక్టర్ టెం డర్లలో పాల్గొనడం లేదు. నెల రోజులుగా దేవస్థానం అధికారులు అయిదు సార్లు టెండర్లు ఆహ్వానించగా టెండర్లు దాఖలు కాలేదు. క్రితం సారి దానిలో ఒక్కరు మాత్రమే టెండర్ దాఖలు చేయగా దాన్నీ రద్దు చేసిన అధి కారులు మరో సారి ఫిబ్రవరి 1న ఆరవ సారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంజన్న భక్తులు తమ మొక్కుల రూపేణ తలనీలాలు స్వామి వారికి సమర్పించడం ఆనవాయితీ కాగ వాటిని సేకరించడానికి దే వస్థానం తరుపున టెండర్లు నిర్వహించి వాటి సేకరణ వ్యాపారులకు అప్పగిస్తుంటారు. నాలుగేళ్లుగా జీఎస్టీని వ్యాపారులకు అంటగ ట్టడంతో సేకరణపై సందిగ్ధం ఏర్పడింది. హెచ్చు పాట దారు తన టెండర్ ధరలపై జీఎస్టీ చెల్లించాలనే నిబంధనలు కురుల సేకరణపై ప్రభావం పడ్డాయి. దీంతో వ్యాపారులు టెండర్లకు ముందుకు రాక పోగా ఇప్పుడు అంతర్జా తీయ మార్కెట్‌లో కురులకు ధరలు పడిపోయాయని కాంట్రాక్టర్లు టెండర్లకు రావడం లేదు. దీంతో తలనీలాల సేకరణ దేవస్థానం అధికారుల పై నే పడింది. ఆరు నెలలుగా సిబ్బంది వాటిని సేకరిస్తుండగా వాటిని భద్ర పరచడం ఇబ్బందిగా మారింది.

● అప్పుడు జీఎస్టీ.. ఇప్పుడు ధరల లేమి..

తలనీలాల సేకరణపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమలు చేయాలనే ఆదే శాల నేపథ్యంలో జీఎస్టీ నిబంధనలతో వ్యాపారులు టెండర్లలో పాల్గొనడం లేదు. అయితే హెచ్చు పాటదారుకు టెండర్ సొమ్ములపై జీఎస్టీ విధించి చెల్లించాలనే నిబంధనలపై ఓ వ్యాపారి జీఎస్టీ కింద చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇప్పుడది కోర్టు పరిధి లో ఉండడంతో మరో వ్యాపారి తన టెండర్ కాల పరిమితి ముగిసినప్పటికీ జీఎస్టీ కింద చెల్లించాల్సి సొమ్ములు బకాయిలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జీఎస్టీని మినహాయిస్తేనే టెండర్‌లో పాల్గొంటామని పేర్కొన్న కాంట్రాక్టర్లు తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో కురుల ధరలు పడిపోయాయని ధరలు తగ్గిస్తేనే టెండర్లకు ముందుకు వస్తామని అంటున్నారు. ఇందులో భాగంగా జూలైలో తలనీలాలకు దేవస్థానం అధికారులు టెండర్లు పిలవగా వ్యాపారులు ముందుకు రాలేదు. అప్పటి నుంచి శుక్ర వారం వరకు దేవస్థానం అధికారులు ఐదు సార్లు టెండర్లు నిర్వహించారు. కంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసుకుంటూ వెలుతున్నారు.

● క్రితం సారి..

క్రితం సారి ఏడాది కాలపరిమితికి గాను రూ.3.65కోట్లు కాగా దేవస్థా నం అధికారులు ప్రతి ఏటా పది శాతం పెంపుతో టెండర్లు నిర్వహిస్తుం టారు. జీఎస్టీ, ధరల లేమితో కాంట్రాక్టర్లు టెండర్లకు ముందుకు రాకపోవ డంతో టెండర్ సొమ్ములను తగ్గిస్తారా అనేది దేవాదాయ శాఖ అధికారు లు తేల్చాల్సి ఉంది. దేవస్థానం అధికారులు ఇప్పటి వరకు అయిదు సార్లు వేలంకు షెడ్యూల్ జారీ చేశారు. నాలుగు సార్లు ఎవరూ పాల్గొనగకపోగా రెండు రోజుల క్రితం ముగిసిన దానికి మాత్రం ఒక్కరు పాల్గొన్నారు. దీం తో అది రద్దు చేయాల్సి వచ్చింది. మళ్లీ గురువారం నిర్వహించడానికి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు.

● తమ వాదనలు చెప్పకుండా, టెండర్లకు దూరం

అయితే కాంట్రాక్టర్లు తాము ఏ కారణం చేత టెండర్‌కు దూరంగా ఉం టున్నారో చెప్పాల్సి ఉండగా టెండర్‌లో పాల్గొనకపోవడం దేవస్థానం అధి కారులకు కూడా తలనొప్పిగా మారింది. టెండరులో పాల్గొని జీఎస్టీ కాని మార్కెట్‌లో ధరలు లేవని తేల్చి చెబితే దాన్ని దేవస్థానం అధికారులు దే వాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. గతంలోనూ పలు మార్లు నిర్వహించిన టెండర్‌లో తక్కువకు పాట పాడితే కమిషనర్ కు తెలిపి తగ్గించి అప్పగించిన దాఖలాలు ఉండగా ఇప్పుడు కూడా కాం ట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొంటే తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

● దేవస్థానం తరుపున సేకరణ

తలనీలాల టెండర్ గత జూలైతో ముగియగా అంతకు ముందే నిర్వహించిన టెండర్‌లో వ్యాపార సంస్థలు పాల్గొనకపోవడంతో దేవస్థానం త రుపున అధికారులు తలనీలాలు సేకరిస్తున్నారు. ఆగస్టు నుంచి దేవస్థా నం సిబ్బందే వాటిని సేకరిస్తూ భద్రపరుస్తున్నారు. ఇది అధికారులకు ఇ బ్బందికరంగా పరిణమించింది. సేకరించిన తలానీలాల నిల్వలు పెరిగిపో తుండగా ప్రస్తుతం సేకరిస్తున్న తలనీలాలను టెండర్ అయ్యాక సదరు వ్యాపారికి అప్పగించేందుకు అధికారులు నిర్ణయించారు.

కమిషనర్‌కు నివేదిస్తాం..



కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనకపోవడంపై కమిషనర్ దృష్టికి తీసు కెళ్లాము. మార్కెట్‌లో ధరలు లేవని వ్యాపార సంస్థలు వెనుకంజ వేస్తున్న ట్లు తెలుస్తోంది. మరో సారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. తలనీ లాల టెండర్‌కు అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. టెండర్‌లో పాల్గొంటే వారి అభిప్రాయాలను కమిషనర్‌కు నివేదించే అవకాశం ఉంటుంది.

- పి వెంకటేష్, ఈవో

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, జనవరి 28: రాష్ట్రంలో విద్యారంగాన్ని కాపా డడంతో పాటు రాబోయే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులను కేటాయించి విద్యారంగాన్ని పరిరక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వెంకట్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసిందన్నారు. నూతనం గా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారం గాన్ని పరిరక్షించాలని కోరారు. రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన భావజాలాన్ని ప్రజలపై రుద్దుతోందని, ప్రజల భావోద్వేగాలను రాజకీ యాలకు వాడుకుంటుందన్నారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తోందన్నారు. భారత రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్య క్షుడు అంబటి రమేష్, కోశాధికారి పర్కాల రవీం దర్, జిల్లా కార్యదర్శులు పాముల స్వామి, పోలాస మల్లేశం, కొత్వాల్ ప్రవీణ్, పాశం భాస్కర్, కొక్కుల బాలరాజు, తుమ్మనపెల్లి నరేష్, పసుల సత్యం పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు అద్దాల ధ్వంసం

మల్యాల, జనవరి 28: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశాడు. దిగువ కొండగట్టు వద్ద జగిత్యాల వైపు వెలుతున్న ఆర్టీసీ బస్సు వెనుకాల అద్దాలపై ఆ వ్యక్తి బండరాయితో కొట్టడంతో అద్దం పగిలింది. ప్రయాణికులు తక్కువ ఉండడంతో ప్రమాదమేమి చోటుచేసుకోలేదు. అయితే అద్దానికి అయ్యే ఖర్చులు భరిస్తానని సదరు వ్యక్తి పేర్కొనడంతో ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం

సుల్తానాబాద్, జనవరి 28 : పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఆదివారం వచ్చిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావులకు సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊట్ల వరప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సన్మానించారు. గర్రెపల్లి నుంచి సుల్తాన్‌పూర్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలక సతీష్, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిగా హర్కార నియామకంపై సంబరాలు

అంతర్గాం, జనవరి 28: రామగుండం పట్టణంలోని ఆబాది రామగుండంకు చెందిన హర్కార వేణుగోపాల్‌రావు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియామకం కావడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం ఆబాది రామగుండంలో జిల్లా కాంగ్రెస్ ఫిషరీస్ చైర్మన్ పల్లికొండ శ్యామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ వాజిద్‌ఖాన్, బొద్దుల శంకర్, నామాల కుమార్, బాపు, మందల నరేందర్, తిరుపతి, సత్తయ్య పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానించిన రామగుండం నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 28: బీజేపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులై పెద్దపల్లికి వచ్చిన జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డిని ఆదివారం రామగుండం బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాంచందర్ ఆధ్వర్యంలో సునీల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ నాయకులందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి రాజేష్, మాతంగి రేణుక, కొమ్ము శ్రీనివాస్, మామిడి సంపత్, అడ్లూరి రాజేష్, బరిగెల శ్రావణ్, మంద శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

దొంగతుర్తి సమ్మక్క జాతర కమిటీ ఎన్నిక

ధర్మారం, జనవరి28: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో ఆదివారం సమ్మక్క సారక్క జాతర కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పాలకుర్తి సత్తయ్య, ముత్యాల చంద్రశేఖర్, దాడి సదయ్య, అధ్యక్షునిగా చొప్పరి చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా జుంజుపల్లి రమేష్, బాలసాని తిరుపతి, సాగర్.వెన్నెం రమేష్, గొట్టె మధుకర్, తమ్మడవేని రవి, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా సంకరి రాజయ్యలను ఎన్నుకున్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

ఓదెల, జనవరి 28 : యువ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న హన్మకొండలో నిర్వహించనున్న జాతీయ పురస్కారాలకు ఓదెలకు చెందిన టైలర్ క్యాతం శ్రీనివాస్ ఎంపికైయ్యాడు. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను పురస్కరించుకొని వివిధ రంగాలకు చెందిన వారిని ఈ పురస్కారాలను ఎంపిక చేస్తున్నారు. ఈ మేరకు క్యాతం శ్రీనివాస్ ఎంబ్రాయిడ్ డిజైనర్‌గా సేవా రంగంలో అనుభవం మేరకు ఎంపిక చేశారు. హన్మకొండలో శ్రీనివాస్ పురస్కారాన్ని అందుకోనున్నారు.

నేత్రదానికి ముందుకు రావాలి..

ఓదెల, జనవరి 28 : ప్రతి గ్రామం నుంచి అన్ని వర్గాల ప్రజలు,యువకులు నేత్రదానానికి ముందుకు రావాలని సదాశివ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మేర్గు భీష్మచారి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ క్యాతం రాజేశం అనారోగ్యంతో ఇటీవల మృతిచెందడంతో ఆదివారం సదాశాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్మారక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, దాన ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కుటుంబానికి ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు క్యాతం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, లింగమూర్తి, రమేష్, వాసు, సారంగం, వెంకటేశ్వర్లు, వేణు, సంతోష్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

సుల్తానాబాద్, జనవరి 28 : సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన తంగళ్ళ చెంద్రయ్య హమాలీ కార్మికుడు ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మరణించాడు.వారి కుటుంబానికి. రేగడిమద్దికుంటకు చెందిన ఎంపీటీసీ గడ్డం రాజమణి, సుద్దాల సింగల్‌విండో అధ్యక్షుడు గడ్డం మహిపాల్‌రెడ్డిలు రూ.5000 వేల రూపాయల ఆర్థికసహాయం ఆదివారం కుటుంబ సభ్యులకు అందించారు. వారి వెంట హమాలీ కార్మికులు బేతి రాజయ్య, వెంకటేష్, లక్ష్మణ్‌లు ఉన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

సుల్తానాబాద్, జనవరి 28 : మండలంలోని పూసాల మాజీ సర్పంచ్ మాటేటి గట్టయ్య ఆదివారం మృతిచెందారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మాటేటి గట్టయ్య కొన్నిరోజులుగా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించారు.

కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి లింగయ్య

అంతర్గాం, జనవరి 28: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్‌కు చెందిన జూల లింగయ్య పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ ప్రచార కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈమేరకు ఆదివారం రామగుండం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జూల లింగయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా కోరం సంజీవరెడ్డి

కరీంనగర్ రూరల్, జనవరి 28: ట్రస్మా జిల్లా అధ్యక్షునిగా కోరం సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని తీగలగుట్టపల్లి రంగినేని గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ట్రస్మా కరీంనగర్ జిల్లా సర్వ సభ్య సమావేశంలో జిల్లా కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భగవతి రమణారావు, కోశాధికారిగా రంగు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునిపట్ల తిరుపతిరెడ్డి, కరీంనగర్ నగర అధ్యక్షునిగా రావుల నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా చీఫ్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పట్ల పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉదయ సాహితి ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, జనవరి 28: నగరంలోని ముఖరంపుర, వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయ సాహితి ఆవిర్భావ దినోత్సవం, రాష్ట్ర స్థాయి కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి హాజరై మాట్లాడుతూ సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకమని అన్నారు. కవులు తమ స్పందనలతో ప్రకటించే భావాలు సమాజానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. ఉదయసాహితి గత కొన్నేళ్ళుగా సాహితీ రంగంలో కవులను తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. ఎర్రం రాజారెడ్డి అధ్యక్షతన ఏర్పడ్డ కొత్త కమిటీని అభినందించారు. అతిథులుగా హాజరైన శ్రీదాస్యం లక్ష్మయ్య, దాస్యం సేనాధిపతి, నంది శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు ఎర్రం రాజారెడ్డి, రేళ్ళ సంజీవ్ మాట్లాడారు. కార్యక్రమంలో గుండు రమణయ్య, వెగ్గలం ఉషశ్రీ, ఎన్ నాగవేణి, విజయలక్ష్మీ శ్రీనివాస్, చిందం సునీత, కె మాధవి, డాక్టర్ ఎ తిరుమలరెడ్డి, వి జయపాల్‌రెడ్డి, నగునూరి రాజన్న, ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో గాయపడిన మైనింగ్ సర్దార్ మృతి

గోదావరిఖని, జనవరి 28: సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో ఈనెల 22న జరిగిన గనిప్రమాదంలో గాయపడిన మందసమ్మిరెడ్డి(50) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. టబ్బులు అదుపుతప్పి మైనింగ్ సర్దార్‌పైకి దూసుకురావడంతో పక్కటెముకలు విరిగి అక్కడనే తీవ్ర రక్తస్రావం అయిన సమ్మిరెడ్డిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం అతని పరిస్థితి విషమంగా మారింది మృతిచెందాడు.

సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సమ్మిరెడ్డి మృతిచెందడంపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. సంస్థ సమ్మిరెడ్డి కుటుంబాన్ని అన్నీ విధాలా ఆదుకోవాలని మక్కాన్‌సింగ్ సీఎండీని కోరారు.

అభివృద్ధిని ఓర్వలేక అసత్య ఆరోపణలు

- మేడారం జాతరకు కూడా మహిళలకు ఉచిత ప్రయాణం - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలన్నర కాకమందే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, దీన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారురు. ఆదివారం రాత్రి గోదావరిఖని మార్కండేయకాలనీలోని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో 48గంటల్లో రెండు పథకాలను అమలు చేసిందని, మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు రూ. 10లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్సను అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ కొంగు బంగారమైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు మహిళలకు ఆర్‌టీసీ బస్సులో ఉచిత ప్ర యాణం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మిగతా నాలుగు పథకాల ను కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఐటీ పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.

రామగుండంలో ఐటీ పరిశ్రమను ఏర్పాటు చేయండి..

శ్రీధర్‌బాబును కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం నియోజకవర్గ అభివృద్ధితో పాటు రామగుండంలో ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. సన్మాన సభలో మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ రామగుండం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఖజానా మొత్తం ఖాళీ అయ్యిందని, ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం కొత్తగా పరిశ్రమలను తీసుకురావాలని, పోలీసులు రామగుండంలో లాఅండ్ ఆర్డర్‌ను కాపాడాలని, ఎవరైనా పంచాయితీలు చేసినా, ఇతర దందాలు చేసినా తనకు శాశ్వతంగా దూరం కావాల్సి వస్తుందని, రామగుండాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు, పార్టీకి ఎవరైనా నష్టం కలిగిస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, నాయకులు నడిపెల్లి రాంమోహన్ రావు, కాల్వ లింగస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, మారెల్లి రాజిరెడ్డి, ఫజల్ బేగ్, గట్ల రమేష్, నాయిని ఓదెలు, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, మాదరబోయిన రవికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రికి ఘనంగా సన్మానం..

గోదావరిఖని, జనవరి 28: రాష్ట్ర ఐటీశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి మొట్టమొదటి సారిగా గోదావరిఖనికి వచ్చిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆదివారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఘనంగా సన్మానించారు. మంత్రి శ్రీధర్‌బాబును బీ పవర్‌హౌస్‌గడ్డ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ఊరేగింపుతో మున్సిపల్ టీ జంక్షన్ వరకు చేరుకున్నారు. మున్సిపల్ టీ జంక్షన్ వద్ద గజమాలను క్రేన్ సహాయంతో శ్రీధర్‌బాబుకు వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ అంబేద్కర్ ఆదర్శప్రాయుడు : మంత్రి శ్రీధర్‌బాబు


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి రూరల్, జనవరి 28 : రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయునిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిలిచారని రాష్ట్ర ఐటి శాఖ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని కుర్మపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బిఆర్ అంబేద్కర్ విగ్రహన్ని మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణరావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలనలో ఉన్నత విద్యనభ్యసించి భావితరాలకు తిరుగులేని భవిష్యత్ అందించే భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. దేశ ప్రజలందరూ ఐకమత్యంగా జీవించాలని సూచించారని గుర్తు చేశారు. ఒకే విధమైనా రాజ్యాంగంతో ప్రజలందరిని ఒకేతాటిపై నడిపించడం గొప్ప విషయమన్నారు. గత ప్రభుత్వా హయాంలో ప్రజలందరిని ఇబ్బందులు గురి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పక్కా ప్రణాళికలతో ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ధరణి ని ప్రవేశపెట్టి ఏళ్లు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం చూపలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో కొత్త చట్టాన్ని రూపొందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రతి పేదవాడికి న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, కుర్మపల్లి సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోంకూరి మధు, రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, నాయకులు మైస రాజేష్, మేడి మహేష్, రాజు, ప్రమోద్‌కుమార్, అకారి రాజు, జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య, పెర్క శ్యాం, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, మాటూరి దుర్గయ్య, కాంపల్లి సతీష్‌తో పాటు అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ - కాపులపల్లి గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం


గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే విజయరమణరావు

పెద్దపల్లి రూరల్ , జనవరి 28 : గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కఋషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కాపులపల్లి లో ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితి భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు కలిసి ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో మౌళిక వసతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ గోపు కవిత-శ్రీనివాస్‌లు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎడెల్లి శంకర్, ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, గ్రామ ఉప సర్పంచ్ నల్లవెల్లి అశోక్ , వార్డు సభ్యులు పిట్టల రవి, రాధ, మమత, ఉమా మహేశ్వరి, భారతి, బోడకుంట శ్రీధర్, గోపు రాజశేఖర్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రధాని మోదీ..


సమావేశంలో మాట్లాడుతున్న నంది రామయ్య

కళ్యాణ్‌నగర్, జనవరి 28: ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను మోసం చేస్తున్నాడని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీకి ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు నంది రామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కులం పేరుతో, మతం పేరుతో ప్రజలను విభజిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని ఆరోపించారు. దేశంలో యూనివర్సిటీల కోసం, స్కూళ్ల కోసం బడ్జెట్ కేటాయించడకుండా గుళ్లకు, గోపురాలకు, విగ్రహాలకు వందల కోట్ల రూపాయలు కేటాయిస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. ఓ పక్క పేదలు తిండి లేక, నిరుద్యోగులు ఉద్యోగాలు రాక, రైతులకు గిట్టుబాటు ధర లభించక, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా చేస్తున్న మోదీ అయోధ్యలో రామమందిర నిర్మాణం పేరుతో రాజ్యాంగానికి విరుద్ధంగా రాజకీయాలు నడిపిస్తున్నారన్నారు. మోదీ తొమ్మిదేళ్లలో పాలనలో మతవిద్వేషాలు రేపుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదని, మోదీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. మార్చి 3, 4, 5 తేదీల్లో మూడు విప్లవ పార్టీల విలీనసభ జరుగుతుందని, దీనికి లక్షలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జూపాక శ్రీనివాస్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, చంద్రన్న, పూల శంకర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2,3ల్లో అధికారుల సంఘం ఎన్నికలు


ఓటు హక్కు వినియోగించుకుంటున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 28: కంపెనీ వ్యాప్తంగా ఆదివారం జరిగిన కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏ ఐ) ఎన్నికలు జరిగాయి. ఆర్జీ-2 ఏరియా అధికారులు స్థానిక ఎన్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. జీఎం సూర్యనారాయణ నేతృత్వంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏరియా పరిధిలో 163 మంది అధికారులు ఉండగా, 149 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏరియా స్థాయిలో ఒక ఓటు, కంపెనీ స్థాయిలో ఒక ఓటు చొప్పున రెండు ఓట్లను వేశారు. ఆర్జీ-2 ఏరియాలో జరిగిన ఓటింగ్‌ను కోల్ ఇండియా సీఎంఓఏఐ ప్రతినిధులు శరత్‌కుమార్ తివారి, అజిత్‌కుమార్‌మిశ్రా పరిశీలకులుగా వ్యవహరించారు.

రామగిరి, జనవరి 28: సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్ పరిధిలో కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధికారుల సంఘం ఎన్నికలు ఆదివారం సజావుగా ముగిసాయి. స్థానిక సిఎన్‌సిఓటీ క్లబ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఆర్జీ-3,ఏపిఏ ఏరియాల కమిటి, సింగరేణిబ్రాంచ్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఏరియాల్లో పనిచేస్తున్న అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికకు ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో మొత్తం 221 మంది అధికారులు ఉండగా 198 మంది అధికారులు ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. బ్రాంచ్ కమిటీలో మొత్తం 8 పదవులు ఉండగా 39 మంది, అదే విధంగా ఏరియా కమిటిలో 8 పదవులకు గాను 17 మంది పోటీ పడ్డారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఏరియా కమిటీలోని కోశాధికారి పదవి ఏకగ్రీవ ఎన్నిక జరిగినట్లు తెలిపారు. కౌంటింగ్ అనంతరం పూర్తి ఫలితాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

'వలస కార్మికుల మరణాలపై సీబీఐ విచారణ జరిపించాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 28: జిల్లాలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, వివిధ పరిశ్రమల్లో పనిచేసే వలస కార్మికుల మరణాలపై సీబీఐ విచారణ జరిపించాలని తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ లేబర్ యూనియన్ జిల్లా కార్మిక సదస్సును ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల హత్యలు, ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని, వలస కార్మికులు పని చేసే చోట నిఘా పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జంగ అపర్ణ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, తెలంగాణ లేబర్ యూనియన్ ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కాశిపాక అజయ్, కారుకూరి శ్రీనివాస్, మాల పరిరక్షణ వేదిక ఉమ్మడి కరీంనగర్ అధ్యక్షులు జంగ సాగర్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మహిళా విభాగం అధ్యక్షురాలు జగజంపుల లలిత, మొగురం మీరియా పాల్గొన్నారు.

'పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ టికెట్ పెర్క శ్యామ్‌కు ఇవ్వాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 28: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పెర్క శ్యామ్‌ను ప్రకటిస్తే మద్దతుగా ఉంటామని తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఆదివారం ప్రకటించారు. పెద్దపల్లి పార్లమెంట్ నాయకులు, టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్ పెద్దపల్లి వైట్‌హౌస్‌లో తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యులు కార్యదర్శి పెర్క శ్యామ్‌కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గర్రెపెల్లి రాజేశం, జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు ముస్తఫా, కోశాధికారి మంద భాస్కర్ యాదవ్, అధికార ప్రతినిధి చిప్పకుర్తి శంకర్, వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన వెంకన్న, మంథని డివిజన్ అధ్యక్షులు బొద్దుల జగన్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జనగామ రవి, జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కేటాయించాలని మంత్రికి వినతి

మంథని, జనవరి 28: రాబోయే పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి ఎంపీ టికెట్ కేటాయించాలని మంథని మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు కొండ శంకర్ ఆదివారం హైదరాబాద్‌లోని ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ధర్మారం, జనవరి28: ధర్మారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలసి ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ విద్యా సంవత్సరంలో బోధించిన హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, రాజమల్లయ్య, శ్రీధర్‌రావును ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. చదువుకున్న సమయంలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులం అందరు ఒకే చోట కలవడం చాలా ఆనందంగా ఉందని వారు పలు అభిప్రాయాలను వెల్లడించారు.

'మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 28: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్పొరేషన్ సాధనలో భాగంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌లను మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్, జిల్లా అధ్యక్షులు అనుమల మహేష్ పటేల్, కుల పెద్దలు పూదరి కిషన్ పటేల్, దాసరి రాజేశం పటేల్, చింతపండు స్వామి పటేల్, చింతపండు శంకరయ్య పటేల్ తోట రమేష్ పటేల్ సంఘ నాయకులుపాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

మంథనిరూరల్, జనవరి 28: మున్సిపాలిటీ పరిధిలోని మర్రివాడలో ఇటీవల మృతి చెందని కాసగోని రాజయ్య కుటుంబాన్ని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. రాజయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంటన టీఆర్ఎస్ నేతలు ఆరెపల్లి కుమార్, అడిచర్ల సమ్మయ్యలు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి


గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి, జనవరి28: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. పాలకుర్తి మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో ఆదివారం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందేలా తమవంతు కృషి చేస్తానని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో పక్కా ప్రణాళికలతో పల్లెల్లో అభివృద్ధి పనులు చేపడుతానన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అత్యంత సుందరీకరణంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు వస్తే అ సమస్యల పరిష్కారానికి పాటు పడుతూ ప్రజా పాలన అంటే ఏమిటో చూపిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర రాజకుమారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, సింగిల్‌విండో చైర్మెన్ బయ్యపు మనోహర్ రెడ్డి, ఉప సర్పంచ్ కోల శివయ్య, ఎంపీటీసీలు గంగాధరి రమేష్ గౌడ్, పాత భాగ్యలక్ష్మి రవిందర్, మాజీ సర్పంచ్‌లు పర్సవేణి శ్రీనివాస్ యాదవ్, పొన్నం సత్తయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం

పాలకుర్తి, జనవరి 28: మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మొదటిసారిగా రామగుండం నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఆదివారం బసంత్ నగర్ బస్టాండ్ వద్ద పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఈప్రాంత అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. రామగుండంలో భారీ మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ నియోజక వర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, జీడినగర్ సర్పంచ్ సూర సమ్మయ్య, పుట్నూర్ ఎంపీటీసీ గంగాధరి రమేష్‌గౌడ్, కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి, నాయకులు పాత రవిందర్, వాసుతో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.